


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### నేటి బాలలే రేపటి ఐటమ్ గర్ల్ !!?

ఏవిటీ టైటిల్ అని ఆశ్చర్యపోతున్నారా? ఈ మధ్యన వరుసగా వస్తున్న వివిధ ఛానళ్ళలోని బాల సింగర్ల విన్యాసాలు, పాటల ఎంపిక చూస్తుంటే ‘హారా! నాటి జ్యోతిలక్ష్మి, విజయలలిత, హలం లు ముక్కున వేలేసుకుని ఆశ్చర్యపోయావారేమో కదా‘ అని అనిపిస్తుంది.

చైల్డ్ ప్రోడిజీలు మనకి కొత్తేమీ కాదు. ఎంతోమంది అలనాటి గాయకులూ, గాయనీమణులూ అతి పిన్న వయసునుండే అద్భుతంగా పాడేవారట! ఎమ్మెస్ సుబ్బలక్ష్మలూ, బాల సరస్వతులూ, టంగుటూరి సూర్యకుమారిలూ, లతా మంగేష్కర్‌లూ - పుట్టిన గడ్డ మనది! వాణీ జయరామ్ గారు రెండవ ఏటనే అద్భుతంగా సరిగమలు పలికారని విన్నాను.

ఐతే హైటెక్ యుగంలో..పిల్లల తెలివితేటలూ, డైనమిజమ్ పాదరసం కన్నా వేగంగా పెరిగి పోతున్నాయి. వాళ్ళకి టాలెంట్‌తో బాటు ధైర్యం, చొరవా, అవగాహనా పెరిగిపోయాయి.

మొదటిసారి ఒక హిందీ ఛానెల్ అంత్యాక్షరిలో పిల్లలు పాల్గొని తమ గళమాధుర్యంతో ముగ్ధుల్ని చేస్తుంటే నోళ్ళు తెరుచుకుని చూస్తుండిపోయాం. తర్వాత మన తెలుగు పిల్లలు ఉష, సందీప్ , నిన్న హేమచంద్ర కూడా వెళ్ళి నేషనల్ లెవెల్‌లో మన ప్రతిభ నిరూపించుకుని వచ్చారు. బాలు గారు ఇటువంటి ప్రోగ్రామ్ ఒకటి చేపట్టి ఎన్నో కలికి తురాయిల్ని వెలుగులోకి తెచ్చారు. అందులోంచి బయటపడ్డ మణులెన్నో ఇప్పుడు ప్లేబాక్ సింగర్స్‌గా చిత్రసీమలో వెలుగొందుతున్నారు.

అప్పట్లో నాకు బాగా గుర్తు..ఒక పాప్ సింగర్ కాబోయే గాయనికి ఆయన సూచనలిస్తూ ‘అమ్మా పాట మాత్రం పాడు.డాన్స్ మూవ్‌మెంట్స్ మీద కాన్సన్‌ట్రేషన్ చెయ్యకు..’ అన్నారు.

అది ఎంతో నిజం. చేతులూ , కాళ్ళూ ఊపుతూ, పాట పరిపక్వంగా పాడడానికి చాలా మెళకువ అవసరం. నేను జీవితంలో మొదటి సారి బంగ్లాదేశ్ సింగర్ రూనాలైలాని ఒక్కదాన్నే అలా నర్తిస్తూ తాళయుక్తంగా, మధురంగా పాడడం చూసాను..''దమ్మా దం ..మస్త్‌కలందర్..'' అని. పాశ్చాత్య దేశాల్లో మెడొన్నాలూ, లోపేజులూ కామన్ కానీ, అది రాగయుక్తమో, శృతి పక్వమో అర్థం చేసుకునే

జ్ఞానం నాకు లేదు.! ఇంక మన భారతీయత ఉట్టిపడే పాప్ సింగర్ ఉషా ఉతుప్..ప్రతి కాలూ తాళం వేసేటట్లు, ప్రతి చెయ్యీ చప్పట్లు కొట్టేటట్లు హుషారెత్తిస్తూ ఆవిడ పాటలు పాడుతారు. అది ఆవిడకి వెన్నతో పెట్టిన విద్య.!

గీత అనే చిన్నమ్మాయి ఒక సారి స్టేజ్ మీద నాటి 'భక్త కన్నప్ప' లో పాట 'శివశివ శంకరా..' అని స్వరాలతో సహా పాడుతుంటే, మేము ఒళ్ళు మరిచి చూస్తుండిపోయాము. ఆ తర్వాత ఆ అమ్మాయితో 'అమ్మ ఒక బొమ్మా..నాన్న ఒక బొమ్మా..మీకెందుకీవేళ కోపం వచ్చింది..'' అని 'దేవతలారా దీవించండి' సినిమాలో పాట పాడించారు.

చిన్నపిల్లలచేత ,చిన్నపిల్లల పాటలు పాడించడం కన్నా సాహసం చెయ్యలేదు అలనాటి నిర్మాతలూ, సంగీతదర్శకులూ!

కానీ, ఈనాటి పరిస్థితి అందుకు భిన్నంగా వుంది. ఈ వ్యాసం ఎవర్నీ విమర్శించడానికి కాదు. కాలగమనంలో వస్తున్న మార్పుల్ని సమీక్షించడానికి మాత్రమే వ్రాస్తున్నాను.

టి.వి.ఛానెళ్ళలో వస్తున్న లిటిల్ స్టార్స్, బాల గాయనీ గాయకుల వయో పరిమితి మూడేళ్ళ నుంచీ మొదలౌతోంది. తిరిగీ తిరగని నోరుతో ''చందమామ రావే..'' పాడినా పసికూనలు మనకి ముద్దే. అలాంటిది ఎంతో క్లిష్టమైన స్వరాలతో కూడిన పాటలు, ప్రొఫెషనల్స్ మాదిరిగా అలవోకగా పాడేస్తున్నారు. ప్రేక్షకుల్ని సమ్మోహితుల్ని చేస్తున్నారు. అందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహం, మెంటర్స్, జడ్జిల సహకారం ఎంతో హర్షదాయకం. కానీ బాల్యంలో ఉండాల్సిన సుకుమారత్వం, అమాయకత్వం లాంటి పచ్చివాసనల స్థానే పెంకు ఏర్పడి 'ఠంగున' మోగే 'ఠంగణాలు'గా వాళ్ళ రూపు మార్చేస్తున్నారు.

ఒక ఛాలెంజ్ కార్యక్రమం మొదలయి సెలక్షన్స్ నుండి ఫైనల్స్ దాకా సుమారుగా ఒక ఆరునెలలపాటు ఈ పిల్లలు ప్రాక్టీసులో , షూటింగులలో ఉంటున్నారు. స్కూల్సులో టీచర్స్ వీళ్ళకోసం ప్రత్యేకంగా పాఠాలు చెప్పి, పరీక్షలు మళ్ళీ కండక్ట్ చేస్తే తప్ప వీరి విద్య కుంటుపడకుండా వుండడం సాధ్యపడదు.

ఇంక తల్లిదండ్రులు ఉద్యోగ ధర్మాలు ఎలా నిర్వర్తిస్తున్నారో పరమాత్ముడికీ, వారి బాస్‌లకీ ఎరుక! ఎందుకంటే హీరోయిన్ల తల్లుల్లా, వీళ్ళూ పిల్లలతోబాటు ఎప్పుడూ సెట్లో ఉండాల్సిన పరిస్థితి.! పరాయి ఊళ్ళనుండి వచ్చేవాళ్ళకి ఇక్కడ వసతి సౌకర్యాలు ఇస్తున్నారనుకుంటా. కేవలం పాటమాత్రమే ఐతే ఫర్వాలేదు..ప్రతి ఎపిసోడ్‌కీ వీరి వస్త్రధారణా, మేకప్, కొరియోగ్రఫీ..ఇవన్నీ కూడా ఛాలెంజింగ్ గా మారాయి.

పిల్లలు డాన్స్ చేస్తూ , పాడుతూ, ప్రాక్టీసు చెయ్యడం మంచిదే కానీ, పాటల ఎంపిక చూస్తుంటే మాత్రం మతిపోతోంది.! 'ట' అక్షరం, 'ర' అక్షరం రాని పిల్ల 'ఇప్పటికింకా నా వయసు నిండా పదహారే..చీటికి మాటికి చెయ్యేస్తూ..చుట్టూ కుర్రాళ్ళే..' అనీ 'ఓరోరీ యోగీ..నన్ను కొరికెయ్యరా..' అనీ 'మూడొస్తే ముద్దులు పెడతా.' అనీ కులుకులతో పాడుతుంటే, వెనకాల వివిధమైన అసభ్య భంగిమలలో కొరియోగ్రఫీ.. వాళ్ళూ పసిపిల్లలే కావడం విశేషం..! ఏ పదానికి ఏ భాగం ఊపాలో కూడా తల్లిదండ్రులు దగ్గరుండి నేర్పించి చూస్తూ ఆనంద పరవశులౌతున్నారు.!

ఇక ఎస్.ఎమ్.ఎస్ రిక్వెస్టులలో వాళ్ళు అదే మూడ్‌లో, మత్తుగా..''నాకు కనుక మీరు ఓట్ చెయ్యాలనుకుంటే..సైన్ ఇచ్చి..'' అంటూ హిస్సీ సౌండ్లతో, హస్కీ కంఠంతో.. ఆ మాటకి అర్థం తెలియని వయసులో ఆ పిల్లలు పలుకుతూ అభ్యర్థిస్తుంటే తల్లిదండ్రులు సంతోష సాగరంలో తేలియాడుతున్నారు. నృత్యం, శృంగార పదజాలం పక్కన పెడితే, వాళ్ళ వస్త్రధారణ ఇంకా దారుణంగా

ఉంటోంది. 'తీస్కో..కోకా కోలా..' పాటకి క్లబ్ డాన్సర్‌లా బొడ్డు కనిపిస్తూ డ్రెస్సా? చిన్నజాకెట్టూ, మధ్యలో భాగం ఖాళీ..ఇటువంటి డ్రెస్సులతో వాళ్ళు పెద్దల ముందు డాన్సులు..! పదేళ్ళలోపే టీనేజ్‌లో కూడా తెలీని విషయాల గురించి వాళ్ళకి ఒపోసన పట్టించేస్తున్నారు. తలలు నెరిసిన జడ్జిలు కూడా ఒక్కోసారి సిగ్గుతో తలలు వంచుకునే పరిస్థితి తెప్పిస్తున్నారు.! మొదట్లో పాటల ఎంపికల విషయంలో ఒకరిద్దరు జడ్జిలు హెచ్చరించారు. ఈ సోకాల్డ్ 'ఏస్పయిరింగ్, ఎంకరేజింగ్' తల్లిదండ్రులు ఆ మాటలు పట్టించుకోలేదు. పిల్లల్ని 'ముమైత్ ఖాన్ లు' తల తడుముకునే విధంగా తర్ఫీదు ఇవ్వడంలో బిజీగా వున్నారు. దాంతో వాళ్ళూ అలవాటు పడిపోయారు పాపం..!

చిన్నప్పుడు పిల్లల చేత "శ్రీరాముని దయచేతను.." లాంటి పద్యాలూ "పదములే చాలును రామా.." లాంటి పాటలూ పాడించేవారు. కానీ ఇప్పుడు "కొంచెం..కొంచెం కొరుక్కు తిను..", "అబ్బనీ తియ్యని దెబ్బ.." లాంటి పాటలు అక్షరాభ్యాసంతో పాటు నేర్పించేస్తున్నారు. ఇంక వాళ్ళు ఆ పాటలు పాడుతూ శృంగార భంగిమలు ప్రదర్శిస్తున్నప్పుడు క్లోజ్ అప్‌లలో పిల్లల తల్లిదండ్రుల మొహాల్లో భావాల్ని చూపిస్తున్నప్పుడు..ఎక్కడి కెళుతున్నాం ఈ నాగరికతలో!? అనిపిస్తోంది.

ఇదంతా నాణేనికి ఒక వైపు. ఇంకో వైపు చూస్తే ఒక్క సారిగా మూడేళ్ళ పిల్లకి స్టార్డమ్ వస్తోంది. అందరి ఎటెన్షన్, కెమేరాలూ ఆమె వైపు తిరుగుతున్నాయి. దానికి తోడు ఎస్.ఎమ్.ఎస్‌లు, వాటికోసం రాజకీయాల ప్రచారం అంత ప్రచారం, రాకపోతే తల్లిదండ్రులు ఏదో విపత్తు వచ్చినట్లు వెక్కి వెక్కి శోకాలు..తనేం తప్పుచేసిందో, అమ్మా నాన్నా ఎందుకిలా హృదయం బద్దలయ్యేట్లు ఏడుస్తున్నారో తెలీక పిల్లలు బిక్కచచ్చిపోతున్నారు. ఒక్కసారిగా వాళ్ళు హీరోల నుండి జీరోలుగా ప్రజలందరి సమక్షంలో 'మీడియా'లో దిగజారిపోవడం, వాళ్ళు తట్టుకోలేక బ్రేక్ అవడం, ఇంత ఎమోషనల్ ట్రూమా వీళ్ళకి ఈ పసి వయసులో అంత అవసరం అంటారా? ఇంత ఒత్తిడిని ఈ పసి గుండెలు తట్టుకోగలవా? ఛానెల్ వ్యూయర్ షిప్ కోసం రేటింగుల కోసం ఈ రియాల్టీ షోస్‌లో పసిహృదయాలతో ఆడుతుంటే ఏ మానవహక్కుల సంఘాలవాళ్ళు వచ్చి అడ్డుకోరే?

షోలు ఆపెయ్యమని కాదు..నిబంధనలు ఉండలన్నదే నా అభిమతం. ఎందుకంటే ఒక తండ్రికి ఈ మధ్య తన కూతురు ఈ పోటీలోంచి ఎలిమినేట్ అయ్యేసరికి గుండెపోటు వచ్చిందంట!

జంతువులని హింసిస్తే ఆ హక్కులని రక్షించేందుకు పోరాటం చేసేవాళ్ళు, ఆశ్లీలం చూపిస్తే సెన్సార్ సంఘం వాళ్ళూ, చివరికి కొండల్ని పగలగొడితే సంరక్షక సంఘాలూ కూడా ఉన్నాయే..మరి ఈ పసిపిల్లల మనోభావాల సంరక్షణ చట్టం,,మన దేశంలో లేదా? ఇక రాదా?

ఒకసారి ఆగి ఆలోచించండి! వయసుతో బాటుగా తెలుసుకోవాల్సిన సంగతుల్ని మన పిల్లలకి అతి చిన్న వయసులోనే వివరించడం, అందుకు తగ్గ భావాల్నీ, భంగిమల్నీ అనుకరించమని ప్రోద్బలం చెయ్యడం..గుడ్డు సహజంగా పగలకముందే చిదిమేసి వాళ్ళకి ఈకలు కట్టి యవ్వనం అనే పూదోట బదులు ఎండిన కాంక్రీటు వనాల మధ్యకి తోసేస్తున్నారేమో.. ఒక్కక్షణం ఆత్మ విమర్శచేసుకోవాల్సిన సమయమిది..!